క్లుప్తంగా

అద్దె ప్రాతిపదికన గదుల కేటాయింపు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులను అద్దె ప్రాతిపదికన డ్రా పద్ధతిలో కేటాయించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం తెలిపారు. మూడు అంతస్తుల్లో ఖాళీగా ఉన్న 17 దుకాణాలను ఫిక్స్‌డ్ రేట్‌పై రెండు సంవత్సరాల కాల పరిమితితో డ్రా పద్ధతిన కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ ముందు భాగం ఒకటికి నెలకు రూ.5900, గ్రౌండ్ ఫ్లోర్ వెనుక భాగం ఒకటికి రూ.4 వేలు, ఫస్ట్ ఫ్లోర్ ఒకటికి రూ.3 వేలు, సెకండ్ ఫ్లోర్ మొత్తం రూ.14,750 ఫిక్స్‌డ్ రేటు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని, 13వ తేదీ ఉదయం 10 గంటలకు డ్రా తీసి దుకాణాలు కేటాయించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

అధ్వానంగా బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట శివారు బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు అధ్వానంగా మారింది. బంజేరుపల్లి రోడ్డు నుంచి దేవస్థానానికి కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ నిర్మాణంలో భాగంగా గత ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. రూ. 60 లక్షల వ్యయంతో ఆలయం వరకు రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మించి రెండేళ్లు కాకుండానే అధ్వానంగా మారి ప్రమాదాలకు నెలవుగా మారింది. మరో రెండు రోజుల్లో మహాశివరాత్రి రానున్న క్రమంలో ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. ఈ విషయంపై ఏఈని సాక్షి ఫోన్‌లో సంప్రదించగా ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటానన్నారు.

దరఖాస్తులకు నేడు తుదిగడువు

జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రూప్ 1,2,3,4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సై, కానిస్టేబుల్ తదితర జాతీయ, రాష్ట్రస్థాయి ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు బుధవారం తుదిగడువని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోర్సు ద్వారా 3 నెలల పాటుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 10న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు స్థానిక ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలన్నారు.

ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలి

గజ్వేల్: ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందాలంటే వందశాతం పన్నుల వసూలు కీలకమన్నారు. ఇంటి పన్నులే కాకుండా ట్రేడ్ లైసెన్స్‌లు వందశాతం వసూలయ్యేలా చూడాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలి

సిద్దిపేటకమాన్: ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రియల్ వ్యాపార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు గ్రామ పంచాయతీ లేఅవుట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలనడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో యువతి మృతి

ఆరునెలల క్రితం చెల్లెలు ఆత్మహత్య


నందిని (ఫైల్)

దుబ్బాక: క్షణికావేశంలో చెల్లెలు ఆత్మహత్య చేసుకోగా, ఆరు నెలల వ్యవధిలో క్యాన్సర్‌తో అక్క మృతి చెందింది. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాల్సిన పిల్లలు కానరాని లోకాలకు వెళ్లడంతో వారికి తీరని శోకం మిగిలింది. ఈ విషాదకర ఘటన దుబ్బాకలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణానికి చెందిన మార్గాల శంకర్, వసంత దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శంకర్ ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కూతురు నదియకు వివాహమైంది. మరో కూతురు నవిత క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి ఘటన మరవక ముందే రెండో కూతురు నందిని క్యాన్సర్‌తో మృతి చెందింది. పిల్లలు కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు చూసి స్థానికులు కంటతడి పెట్టారు. ఆ కుటుంబాన్నికి దాతలు ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

మల్లన్నసాగర్ కాలువ పనులు ప్రారంభం


కాలువ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

దుబ్బాకటౌన్: మల్లన్నా..నీళ్లొచ్చేనా శీర్షికన సాక్షిలో రెండు రోజుల క్రితం వచ్చిన కథనం అందరిని కదిలించింది. మల్లన్నసాగర్ కాలువ నిర్మాణం పనులు నిలిచిపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను సాక్షి వెలుగులోకి తేవడంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. అధికారులను కాలువ పనులు వెంటనే ప్రారంభించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం కాళేశ్వరం డీఈఈ, ఏఈలు దుబ్బాక–ముస్తాబాద్ రోడ్డులో నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి ప్రారంభించారు. త్వరలో కాలువ నిర్మాణం పూర్తిచేసి, ఆ కాలువ పరిధిలోని గ్రామాలకు నీరు పారేలా చూస్తామన్నారు.

నిందితులకు శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్

సీపీ అనురాధ


మాట్లాడుతున్న సీపీ అనురాధ, పక్కన అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: నిందితులకు శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్ చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. తన కార్యాలయంలో స్టేషన్ రైటర్లు, టెక్ టీం సిబ్బంది, రిసెప్షన్ వర్టికల్ సిబ్బందితో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. ఇన్వెస్టిగేషన్ సపోర్టు సెంటర్ సేవలు వినియోగించుకోవాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, పోక్సో తదితర కేసుల్లో 60 రోజుల్లో దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ వేయాలన్నారు. స్టేషన్ టెక్ టీం సిబ్బందికి త్వరలో వర్టికల్ వారీగా రివార్డులు అందజేస్తామని వెల్లడించారు. 5 ఎస్ ఇంప్లిమెంటేషన్ చేసిన ఫొటోలను సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి స్టేషన్‌లో రిసెప్షన్, వర్టికల్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి భరోసా కల్పించి తొందరగా న్యాయం చేయాలని సూచించారు. ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ పురోగతి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజా చైతన్యం విద్యతోనే సాధ్యమని, అదే సమాజ పురోగతికి సరైన మార్గమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత పూర్తి స్థాయిలో సాధించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలన్నారు. ఎంచుకున్న లక్ష్యం చేరాలంటే పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

డీపీఎం కరుణాకర్


మాట్లాడుతున్న డీపీఎం కరుణాకర్

సిద్దిపేటరూరల్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్న క్రమంలో ప్రతీ మహిళా అవకాశాలను అందిపుచ్చుకోవాలని డీపీఎం కరుణాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో లక్‌పతి దీదీపై నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్, సిద్దిపేటఅర్బన్ మండలాలకు చెందిన సీఏలు, వీవోఏలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడారు. మహిళలు ఇప్పటికే అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించడంతో పాటుగా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు విజయనిర్మల, చంద్రం, మహిపాల్, సీసీలు హన్మంతరెడ్డి, రాజేందర్, భాగ్య, సీఏలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్థానిక స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో విదేశీ విద్య అవకాశాలు, ఉపకార వేతనాలపై ఐయూఏసీ, టీఎస్‌కేసీల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత, కళాశాల, గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్స్ ఫోరం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన కల్పించామన్నారు. ఈ విద్య అర్హత పరీక్షలైన జీఆర్ఈ, ఐఈఎల్‌టీఎస్‌కు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. విదేశీ విద్యాసంస్థల్లో అడ్మిషన్‌కు ప్రాసెసింగ్ ఫీజు లేకుండా ఉచిత మార్గదర్శనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త సిహెచ్ మధుసూదన్, డాక్టర్ శ్రీనివాస్, అయోధ్యరెడ్డి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు సన్మానం


వీఓఏలను సన్మానిస్తున్న లక్కిరెడ్డి తిరుమల

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని డ్వాక్రా మహిళలను చైతన్య పరుస్తున్న మండల వీఓఏలను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నారి శక్తివందన్ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, వేంకటేశం, భోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్న భూములు అన్యాక్రాంతం

సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూములు కాపాడాల్సిన ఆలయ ఈవో పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాడన్నారు. గతంలో లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. ఇటీవల కొందరు ఓ నాయకుడి అండతో వాటిని కూల్చి వ్యాపార సముదాయలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూములు కాపాడాలని, లేని పక్షంలో ఆలయం వద్ద దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, కృష్ణారెడ్డి, నాయకులు ఇస్తారి, సాయిలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఉద్యోగులు

గజ్వేల్‌రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి యూఈఈయూ ఉద్యోగులు, కార్మికులు చేయూత అందించారు. మర్కుక్ విద్యుత్ ఆపరేటర్ ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, కార్మికులు పట్టణంలోని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) గజ్వేల్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ శాఖ డీఈ భానుప్రకాష్ చేతుల మీదుగా ప్రభాకర్ కుటుంబానికి రూ.66 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ జగదీష్, ఏఈ సుదీర్, ఏఈ బాబయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, టీఎస్ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పర్శరాములు, ఉపాధ్యక్షుడు చంద్రయాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రవికుమార్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీ యాదగిరియాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి మళ్లీ దరఖాస్తు

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం తమకు అమలు కావడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించిన క్రమంలో విద్యుత్ అధికారులకు తమ వివరాలు అందజేశామన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమకు బిల్లులు వచ్చాయని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తాయని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుబ్బాకను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రమేష్ కుమార్

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీని పారిశుద్ధ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అపరిశుభ్రంగా ఉన్న మురికి కాలువలను యుద్ధ ప్రతిపాదికన శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా చెత్తను కాలువల్లో వేయకుండా మున్సిపల్ చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి దశలో అర్హులైన నిరుపేదలకు లబ్ధి చేకూర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. గతంలో బేగంపేటలో మంజూరు చేసినప్పటికీ అప్పటి ప్రభుత్వం నిర్మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి రూపేష్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ మేళాను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత


రెవెన్యూ మేళా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: ఇంటి సమస్యలను రెవెన్యూ మేళాలో పరిష్కరించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పట్టణ ప్రజలను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ మేళా కేంద్రాన్ని ప్రారంభించారు. ఇంటి నంబర్, ఇంటి పన్ను ఆన్‌లైన్ ఎంట్రీ, ఇంటి పన్ను ఎక్కువగా రావడం, ఇంటి పన్ను బకాయిని వన్ టైం సెటిల్‌మెంట్ కింద పన్ను వడ్డీ పై 90 శాతం మాఫీ పొందుట, ఆన్‌లైన్‌లో పేరు తప్పుగా పడుట, ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండి పేరు మార్పిడి చేసుకోకపోవడం తదితర సమస్యలను రెవెన్యూ మేళా ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారంలో రెవెన్యూ మేళా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మద్దూరు(హుస్నాబాద్): పదో తరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దూల్మిట్ట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు బైరాన్‌పల్లి, కూటిగల్ గ్రామాల్లోని విద్యార్థులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సౌజన్యంతో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి 10 జీపీఏ సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బర్మ రాజమల్లయ్య, నాచగొని వెంకట్‌గౌడ్, స్వర్గం లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీ చెల్లించాలి

కొండపాక(గజ్వేల్): ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వెంటనే కూలీ చెల్లించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్, తిప్పారం గ్రామాల్లో జరుగుతున్న ఈజీఎస్ పనులను మంగళవారం పరిశీలిస్తూ కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ పనులు చేసిన కూలీలకు నాలుగు నెలలుగా డబ్బులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌కు వినతి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ నుంచి గుండ్లపల్లె వయా వడ్లూరు మీదుగా బెజ్జంకి మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్ నడపాలని కోరుతూ వడ్లూరు గ్రామానికి చెందిన ఆర్‌టీఐ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి రాసూరి మల్లికార్జున మంగళవారం కరీంనగర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ బస్సు సర్వీసు విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రభుత్వాన్ని బద్నాం చేయొద్దు**

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు చేయకుండా కాలయాపన చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసం మహేందర్ యాదవ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు సిద్దిపేట నియోజకవర్గంలో అనేక సమస్యలు సృష్టించారని ఆరోపించారు. మాచాపూర్, ఎల్లాయపల్లి గ్రామాల్లో కాలువలు నిర్మించకుండా రైతుల మధ్య విభేదాలు సృష్టించి పనులు నిలిపివేశారన్నారు.

◆ **కుక్క దాడి: పలువురికి గాయాలు**

నంగునూరు(సిద్దిపేట): పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం నంగునూరులో జరిగింది. రోడ్డుపై వెళ్తున్న వారిపై కుక్క దాడి చేయడంతో ఆరుగురికి స్వల్పంగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని నంగునూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

◆ **భద్రకాళికి పూజలు**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రకాళి పూజ, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం భద్రకాళికి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు.

◆ **సద్వినియోగం చేసుకోండి**

హుస్నాబాద్: గృహలక్ష్మి పథకంలో భాగంగా కరెంట్ బిల్లు జీరో రాని వినియోగదారుల కోసం ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం తెలిపారు. ప్రజాపాలన మొదటి దఫాలో తీసుకున్న దరఖాస్తుల్లో ఉన్న వారికి కరెంట్ బిల్లు జీరో రాని వారికి మీటర్ నంబర్ సరిచేసేందుకు నూతన ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేందుకు పట్టణంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం, బస్తీ దవాఖానా గోదాం గడ్డ, మల్లెచెట్టు చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

◆ **మహిళల కబడ్డీ పోటీలు**

హుస్నాబాద్‌రూరల్: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తోటపల్లి గ్రామంలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

◆ **నేడు తైబజార్ వేలం**

దుబ్బాక: దుబ్బాకలో నిర్వహించే కూరగాయల మార్కెట్, పశువుల సంత తైబజార్‌కు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మంగళవారం తెలిపారు. వేలం కోసం డీడీలు తీసిన వారు ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే వేలం పాటకు హాజరుకావాలన్నారు.

◆ **సన్మానం**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పెద్దతండా గ్రామానికి చెందిని గుగులోతు కోమా, కోబాల్ దంపతుల కుమార్తె కవిత సిద్దిపేట జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. మంగళవారం కాంగ్రెస్ నాయకులు గుగులోతు రాంబాబునాయక్, గుగులోతు భాస్కర్‌నాయక్, జుమ్లానాయక్, నరసింహనాయక్, తిరుపతి నాయక్ ఆమెకు శాలువా కప్పి సన్మానించారు.

◆ **నీటి విడుదలకు వినతి**

రాయపోలు(దుబ్బాక): తమ ఊరి చెరువు ఎండిపోయిందని, భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు నీళ్లు పోయడంలేదని వరిచేలు ఎండిపోతున్నాయని మండలంలోని లింగారెడ్డిపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లింగారెడ్డిపల్లిలోని విశ్వనాథుని చెరువులోకి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తరలిస్తున్న నీటిని అంకిరెడ్డిపల్లి కెనాల్ నుంచి విడుదల చేయాలని మంగళవారం తహసీల్దార్ దివ్యకు వినతిపత్రం అందజేశారు. పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు వివరించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

◆ **ఫిల్టర్ ఇసుక తయారీ స్థావరంపై దాడి**

గజ్వేల్‌రూరల్: ఫిల్టర్ ఇసుక తయారీ స్థావరం, అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడిచేసిన సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్గుపల్లి శివారు వాగులో ప్రభుత్వ అనుమతి లేకుండా ఫిల్టర్ ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారంపై అందింది. దాడిలో నంబరు లేని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఫిల్టర్ ఇసుక తయారు చేసి అమ్మినా, అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు.

◆ **విద్యార్థినికి అభినందనలు**

సిద్దిపేటఅర్బన్: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మండలంలోని బక్రిచెప్యాల ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బండి శరణ్య ప్రథమ బహుమతి సాధించింది. మంగళవారం విద్యార్థినిని హెచ్ఎం నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ఎస్టీ విద్యార్థులు హైదరాబాద్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి ఫిరంగి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే విద్యార్థులు 2018 ఏప్రిల్ 31లోపు జన్మించి ఉండాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలకు మించరాదన్నారు. ఈనెల 11లోగా జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15న జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2024–25 విద్యాసంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా విదేశాల్లోని గుర్తింపు పొందిన యూనివర్సిటీల్లో విద్యభ్యసించే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 31 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

◆ **విద్యా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం విద్యా సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1998–99లో చదువుకున్న 46 మంది ఆయా రంగాల్లో స్థిరపడ్డారు. తాము చదువుకున్న పాఠశాలలో విద్యా సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

◆ **ఘనంగా దయానంద సరస్వతి జయంతి**

సిద్దిపేటఅర్బన్: ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి జయంతిని మంగళవారం మండలంలోని పొన్నాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్షశోధ సంస్థానం నిర్వాహకురాలు ఆచార్య నీరజ హాజరై భారతీయ సంస్కృతి, మానవ విలువల గురించి విద్యార్థులకు వివరించారు.

◆ **రిలేదీక్షకు మద్దతు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన అర్హులకు భూ పంపిణీ చేయాలని బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు చేస్తున్న రిలే దీక్షలకు మంగళవారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

◆ **వాహనదారులకు కౌన్సెలింగ్**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 65 మంది వాహనదారులు పట్టుబడ్డారన్నారు.

◆ **నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మూడు రోజుల పాటు గణపతి, హనుమాన్, సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వైశ్యభవన్ అధ్యక్షుడు గట్టు రవి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో విగ్రహప్రతిష్ఠ కరపత్రాలను ఆవిష్కరించారు.